పోలీస్ అవుట్ పోస్టు పెట్టాలి



ఆస్పత్రి ఆవరణలో పోలీస్ అవుట్‌పోస్టు ఏర్పాటు చేయాలి. వివిధ ఆరోగ్య సమస్యలతో ఆస్పత్రికి వచ్చే రోగుల వెంట ఒక్కోసారి పదిమంది వరకూ వస్తున్నారు. వారిలో కొంతమంది మద్యం సేవిస్తూ వస్తారు. కొందరు ఇష్టానుసారం మాట్లాడుతారు. అలాంటి వారు భయపడాలంటే నిరంతరం పోలీసులు అందుబాటులో ఉండాలి. వైద్యులు, సిబ్బందిపై దాడులు జరిగే అవకాశం ఉండదు. రాత్రి వేళ విధులు నిర్వహించే మహిళా వైద్యులకు సహాయకులుగా మహిళలు ఉండాలి. ప్రభుత్వం, పోలీస్ ఉన్నతాధికారులు ఈ దిశగా ఆలోచించాలి.

– డాక్టర్ భారతి, సూపరింటెండెంట్, అగనంపూడి ఏరియా ఆస్పత్రి

మూడంచెల సెక్యూరిటీ ఉండాలి



రాత్రి వేళల్లో రోగులతో పాటు వారితో వచ్చే వారిని లోపలికి అనుమతించేందుకు మూడంచెల విధానంలో భద్రతా సిబ్బంది ఉండాలి. అవసరానికి మించి సహాయకులను పంపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. రాత్రి సమయంలో వచ్చే వారిలో కొంతమంది బెదిరిస్తుంటారు. కొందరి నడవడిక వల్ల మహిళా వైద్యులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. దీన్ని అధిగమించేందుకు విమానాశ్రయాల్లో మాదిరిగా భద్రత వ్యవస్థ ఉండాలి.

– డాక్టర్ చైతన్య, పీజీ విద్యార్థి

రాత్రి డ్యూటీ అంటే భయమే



రాత్రి వేళలో ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది ఎవరైనా విధులు నిర్వహించాలంటే భయం భయంగానే ఉంటుంది. గతానికి భిన్నంగా పరిస్థితులు మారిపోయాయి. ఏ చిన్న సంఘటన జరిగినా వైద్యులు, సిబ్బందిని బాధ్యులుగా భావించి దాడులకు పాల్పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో రాత్రి డ్యూటీ అంటే భీతిల్లాల్సివస్తుంది. ప్రభుత్వం, పోలీస్ ఉన్నతాధికారులు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సమన్వయంతో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలి.

– హేమలక్ష్మి, నర్సింగ్ సూపరింటెండెంట్ అగనంపూడి ఏరియా ఆస్పత్రి

బాక్సింగ్

- జాతీయ కోచ్ స్థాయికి ఉక్కు ఉద్యోగి
- మెరికల్లాంటి బాక్సర్లను అందించిన ఘనత సొంతం



అయన పంచ్ విసిరితే పతకమే.. ఇది ఒక నాటి మాట. అంతటితో ఆగిపోలేదు. ఉద్యోగం వచ్చిందని గుర్తింపు ఇచ్చిన క్రీడను వదల్లేదు. ఆ మక్కువే అతన్ని జాతీయ స్థాయి కోచ్ స్థానంలో నిలబెట్టింది. ఎంతో మంది బాక్సింగ్ క్రీడాకారులను అందించింది. ఒక వైపు ఉద్యోగంలో బిజీగా ఉంటూనే శిక్షకుడిగా కొనసాగుతున్న స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి కడియాల శ్రీనివాసరావు గురించి తెలుసుకుందాం.

ఉక్కునగరం: కృషి ఉంటే నచ్చిన రంగంలో అగ్రస్థానానికి చేరుకోవచ్చని నిరూపించాడు. ఇష్టమైన క్రీడే ఇంటి పేరుగా మారిన వారు అరుదుగా ఉంటారు. అలాంటి కొద్ది మందిలో శ్రీనివాసరావు ఒకరు.

బాల్యం నుంచి బాక్సింగ్‌పై ఆసక్తి

చిన్నప్పటి నుంచి బాక్సింగ్‌పై ఆసక్తి ఉన్న శ్రీనివాసరావు పాఠశాల స్థాయిలో బాక్సింగ్ నేర్చుకున్నారు. గోపాలపట్నం జెడ్పీ హైస్కూల్‌లో 10వ తరగతి పూర్తి చేసిన శ్రీనివాసరావు 1979లో మొదటిసారిగా బాక్సింగ్ పోటీల్లో పాల్గొన్నారు. ఆ పోటీల్లో ఓడిపోయినప్పటికీ వెరవకుండా ముందుకు సాగారు. పతకాల పంట పండించారు. శ్రీనివాసరావు 1987లో స్టీల్‌ప్లాంట్‌లో జూనియర్ ట్రైనీగా చేరి ఇంజినీరింగ్ షాప్స్ అండ్ ఫౌండ్రీ విభాగంలో బాధ్యతలు నిర్వహించారు. అయినా బాక్సింగ్‌ను వదల్లేదు.1990లో సిమ్లాలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో కాంస్య పతకం సాధించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో మూడుసార్లు బంగారు పతకాలు, నాలుగు సార్లు రజత పతకాలు సాధించారు. బాక్సింగ్‌లో ఆయన ప్రావీణ్యం గుర్తించిన యాజమాన్యం 2000లో స్టీల్ ప్లాంట్ స్పోర్ట్స్ విభాగానికి బదిలీ చేసింది. 2010లో జూనియర్ ఆఫీసర్‌గా పదోన్నతి పొందారు.

స్పోర్ట్స్ కోటాలో కొలువులు

బాక్సింగ్‌లో ప్రతిభ చూపిన ఆయన శిష్యుల్లో సుమారు 100 మంది స్టీల్‌ప్లాంట్, సీఐఎస్ఎఫ్, బీఎస్ఎఫ్, రైల్వేలో ఉద్యోగాలు సాధించారు. అదే విధంగా 20 మంది స్పోర్ట్స్ కోటాలో ఇంజినీరింగ్, యూనివర్సిటీల్లో సీట్లు తెచ్చుకున్నారు. 2005 లో ఆయన పంజాబ్‌లోని భటిండాకు చెందిన సంస్థ నిర్వహించిన రిఫరీ పరీక్షలో పాసయ్యారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు సుమారు 30 జాతీయ స్థాయి పోటీలకు రిఫరీగా, జడ్జిగా వ్యవహరించారు. శ్రీనివాసరావు ప్రావీణ్యతను గుర్తించిన బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆయన్ను రింగ్ అఫీషియల్ కమిషన్ మెంబర్‌గా నియమించారు. ఐదేళ్లుగా ఆయన జాతీయ పోటీల్లో రింగ్ ఆఫీషియల్‌గా వ్యవహరిస్తున్నారు.



జాతీయ పోటీల విజేతలతో కోచ్ శ్రీనివాసరావు(ఫైల్)



బాక్సింగ్ ద్వారా ఉద్యోగాలు సాధించిన శిష్యులతో కోచ్ శ్రీనివాసరావు

బాక్సింగ్‌ను విస్తృత పరచడమే లక్ష్యంగా..

స్టీల్‌ప్లాంట్ స్పోర్ట్స్ బోర్డు పరిధిలో జరిగిన ఏడు జాతీయ స్థాయి సీనియర్ బాక్సింగ్ పోటీల్లో శ్రీనివాసరావు సత్తాచాటారు. అయితే ఉద్యోగ బాధ్యతలు ఉన్నా బాక్సింగ్‌ను స్టీల్‌ప్లాంట్, పరిసర ప్రాంతాల్లో విస్తృతం చేయాలనే లక్ష్యంతో పెదగంట్యాడలో భారత్ బాక్సింగ్ క్లబ్, ఉక్కునగరంలో ఉక్కు బాక్సింగ్ క్లబ్ ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి స్టీల్‌ప్లాంట్ పరిసరాల్లో ఆయన పేరు బాక్సింగ్ శ్రీనుగా మారిపోయింది. ఆయన కోచ్‌గా మారి సుమారు 2 వేల మంది బాలబాలికలకు శిక్షణ ఇచ్చారు. అందులో సుమారు 300 మంది అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర స్థాయి, ఇంటర్ రైల్వేస్, ఇంటర్ సర్వీస్, ఇంటర్ స్టీల్ పోటీల్లో బంగారు, కాంస్య, రజత పతకాలు గెలుపొందారు.

చివరి వరకు బాక్సింగ్ శిక్షణ



బాక్సింగ్ అంటే నాకు మక్కువ. అందుకే ఉద్యోగం ఉన్నా గుర్తింపు ఇచ్చిన బాక్సింగ్‌ను మరింత మందికి నేర్పుతాను. జాతీయ స్థాయి గుర్తింపు లభించడానికి కారణం బాక్సింగే. ఈ బాక్సింగ్ వల్ల అనేక మంది శిష్యులకు ఉద్యోగాలు లభించడం ఆనందదాయకం. ఓపిక ఉన్నంత వరకు బాక్సింగ్ శిక్షణ ఇవ్వడమే ధ్యేయంగా ముందుకు సాగుతాను.

– శ్రీనివాసరావు

విశాఖ ఉక్కుపై కేంద్ర వైఖరి మారాలి



ఉక్కు దీక్షా శిబిరంలో పాల్గొన్న ఏఐటీయూసీ కార్మిక సంఘ నాయకులు, కార్మికులు

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్ విషయంలో కేంద్ర వైఖరి మారాలని ఉక్కు పరిరక్షణ కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా కూర్మన్నపాలెం కూడలిలో ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ సారథ్యంలో చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారం నాటికి 1289వ రోజుకు చేరాయి. శిబిరాన్ని సందర్శించిన ఆయన మాట్లాడుతూ విశాఖ ఉక్కును కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికి చూస్తుందని ఆరోపించారు. సొంత గనులు కేటాయించకపోవడం, ఐరన్ ఓర్‌ను ఉక్కుకు అందివ్వకుండా చేయడం ద్వారా విశాఖ ఉక్కు ఉత్పత్తికి విఘాతం కలిగిస్తున్నారని ఆరోపించారు. ముడి సరకు అందించి, సొంత గనులు కేటాయిస్తే లాభాల బాట పట్టిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు మసేనురావు, జె.రామకృష్ణ, కె.రాజబాబు, తాండ్ర కనకరాజు, బీఎంఎల్ నాయుడు, వరప్రసాద్, చీకటి శ్రీనివాసరావు, వి.కృష్ణంనాయుడు పాల్గొన్నారు.

ఒత్తిడిని అధిగమిస్తే ఆశయ సిద్ధి



మాట్లాడుతున్న హెచ్‌ఎం నాగేశ్వరరావు, వాసవీ మహిళా మండలి ప్రతినిధి అనూశ్రావణి

అగనంపూడి: ఒత్తిడిని అధిగమిస్తే ఆరోగ్యంతో పాటు ఆశయ సిద్ధి కలుగుతుందని లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రౌతు నాగేశ్వరరావు, వాసవి మహిళా మండలి ప్రతినిధి బి.అనూశ్రావణి అన్నారు. విప్రో కేర్ సౌజన్యంతో వాసవి మహిళా మండలి ఆధ్వర్యంలో విద్యార్థులకు సంపూర్ణ ఆరోగ్యం, ఒత్తిడిని అధిగమించడం అనే అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి ఒత్తిడికి గురికాకుండా ఉండాలంటే ముందుగా పాజిటివ్ ఆలోచనలు, దృక్పథం కల్గి ఉండాలన్నారు. అనవసర విషయాల్లో తలదూర్చకుండా, ఇష్టంతో చదివితే ఒత్తిడి అనేది ఉండదన్నారు. ప్లకార్డులు ప్రదర్శించి ఒత్తిడిని ఎలా అధిగమించాలో వివరించారు. కార్యక్రమంలో లంకెలపాలెం హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ లక్ష్మి, ఉపాధ్యాయులు రమణ, రాజశేఖర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే సంగతులు



అగనంపూడి నుంచి దువ్వాడ వెళ్లే రహదారిలో తలారివానిపాలెం వద్ద ధ్వంసమైన రహదారి

అగనంపూడి: అగనంపూడి– దువ్వాడ రైల్వేస్టేషన్ అనుసంధాన రహదారి తలారివానిపాలెం కూడలి వద్ద పూర్తిగా ధ్వంసమైంది. ఇప్పటికే పలుమార్లు రహదారిలో గోతులను స్థానికులు గ్రావెల్‌తో పూడ్చారు. అయినా చిన్నపాటి వర్షం కురిసినా రహదారి దెబ్బతింటోంది. నూతుల్లాంటి గోతులు ఏర్పడడంతో వాహన చోదకులు ఫీట్లు చేయాల్సిన పరిస్థితి దాపురించింది. గోతుల వద్ద వాహనాలు ప్రమాదాలకు గురికాకుండా ఉండేందుకు వీలుగా ముళ్లకంచెలు వేశారు.

కొత్త వారు ప్రయాణిస్తే అంతే

గతంలో ఈ కూడలిలో పెద్ద పెద్ద గోతులు ఏర్పడడంతో కొంతమంది స్థానికులు మట్టితో పూడ్చారు. మళ్లీ అదే ప్రాంతంలో గోతులు ఏర్పడడంతో వర్షపు నీరి చేరి గుర్తు పట్టలేక పోతున్నారు. కొత్తవారు ఎవరైనా ఈ మార్గంలో ప్రయాణం చేస్తే ఆ గోతుల్లో పడి గాయాల పాలవుతున్నారు. మూడు రోజుల కిందట కురిసిన వర్షానికి గోతుల్లో నీరు చేరింది. ఇది గమనించని నిర్వాసితకాలనీకి చెందిన సురేష్ అనే యువకుడి వాహనం గోతులో దిగిపోయింది. దీంతో కిందపడిపోయాడు. స్వల్ప గాయాలు కావడంతో వెంటనే అక్కడ ఉన్న వారు గోతిలో ముళ్ల కంచెలు వేసి వాహనచోదకులు అటువైపు వెళ్లకుండా మళ్లించే ప్రయత్నం చేశారు. అధికారులు స్పందించి గోతులను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

పూర్తి పెన్షన్లు చెల్లించాలని వినతి



పీఎఫ్ ట్రస్ట్ అధికారి విహాన్ మహంతికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అక్కిరెడ్డిపాలెం: భెల్ (హెచ్‌పీవీపీ) టీ, ఆర్ సిరీస్ ఉద్యోగుల క్యాజువల్ సర్వీస్ , డేట్ ఆఫ్ జాయినింగ్‌లో లోపాలను సరిదిద్ది పూర్తి స్థాయి పెన్షన్ అందించాలని ప్రొగ్రెసివ్ ఫ్రంట్ నాయకులు సంస్థ పీఎఫ్ ట్రస్ట్ అధికారి విహాన్ మహంతికి వినతి పత్రం అందజేశారు. శుక్రవారం సంస్థ మెయిన్ గేటు నుంచి అడ్మిన్ బిల్డింగ్ వరకు ఉద్యోగులు ర్యాలీగా వెళ్లి పీఎఫ్ ట్రస్ట్ అధికారిని కలిసి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా అధికారి మాట్లాడుతూ సమస్యపై పీఎఫ్ చైర్మన్‌తో మాట్లాడి తగు న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రొగ్రెసివ్ ఫ్రంట్ నాయకులు జి.టి.పి.ప్రకాష్, ఉరుకూటి బాబూరావు, జి.అచ్చెన్ననాయుడు, పి.ఆనంద్ కుమార్, అల్లు అప్పారావు, టి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వాసవీ మాతకు కుంకుమ పూజలు



ప్రత్యేక అలంకరణలో వాసవీ మాత

పెదగంట్యాడ: శ్రావణ మాసం మూడో శుక్రవారం పురస్కరించుకుని జీవీఎంసీ 76వ హౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలోని కన్యకాపరమేశ్వరి పంచాయతన ఆలయంలో వాసవీమాతకు మహిళలు పెద్ద ఎత్తున కుంకుమ పూజలు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ముమ్మిడిశెట్టి ముత్యాలశెట్టి, త్రిమూర్తులు ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

సుప్రీం కోర్టు ఉత్తర్వులను గౌరవించాలి

అగనంపూడి: అర్హత లేకుండా నిర్వాసితుల కోటాలో స్టీల్ ప్లాంట్‌లో ఉద్యోగాలు చేస్తున్న వారిని తొలగించాలని దేశ అత్యున్నత న్యాయస్థానంతో పాటు సీబీఐ, సీవీసీ ఆదేశించినా ఉక్కు యాజమాన్యానికి లెక్కలేదని సీవీఎస్ డబ్ల్యూ ప్రధాన కార్యదర్శి పట్టా రామ అప్పారావు ఆరోపించారు. అగనంపూడిలో నిర్వహించిన సీవీఎస్‌డబ్ల్యూ సమావేశంలో ఆయన మాట్లాడారు. నిర్వాసితులు కాని వ్యక్తులు నిర్వాసితుల కోటాలో ఉద్యోగాలు చేస్తున్నారని, వారిని తొలగించాలని సుప్రీంకోర్టు ఆదేశించినా యాజమాన్యం వారికి కొమ్ముకాస్తుందని ఆరోపించారు. లోపాలను పట్టించుకోని యాజమాన్యం వేతనాల తగ్గింపు, కుదింపు అంటూ కొత్త రాగం పాడుతుందని ఆయన మండిపడ్డారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు మైది రామచంద్రరావు పాల్గొన్నారు.

సాంకేతిక సమస్య వల్లే విద్యుత్ సరఫరాకు అంతరాయం

గాజువాక: చినగంట్యాడ విద్యుత్ సబ్‌స్టేషన్‌లోని చినగంట్యాడ ఫీడర్‌లో ఏర్పడిన సాంకేతిక సమస్య కారణంగా గురువారం జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయానికి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందని ఈపీడీసీఎల్ జోన్–2 డీఈ బి.కె.నాయుడు తెలిపారు. అంధకారంలో జోనల్ కార్యాలయం శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనంపై ఆయన వివరణ ఇచ్చారు. విషయం తెలిసిన వెంటనే తమ సిబ్బంది హుటాహుటిన సమస్యను పరిష్కరించారన్నారు. ప్రస్తుతం ఆ ఫీడర్‌లో సమస్య పరిష్కారమైందని పేర్కొన్నారు.

చందమామ అందిన వేళ



విద్యార్థులు తయారు చేసిన నమూనాలతో ఉపాధ్యాయులు



నమూనాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం

పెదగంట్యాడ: జాబిల్లి పై భారత్ అడుగుపెట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా చంద్రయాన్–3 విజయానికి గుర్తుగా ఆగస్టు 23ను జాతీయ తొలి నేషనల్ స్పేస్ డే గా ప్రకటించారని నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాచకొండ శ్రీనివాస్ అన్నారు. భారత జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంతరిక్ష పరిశోధనకు సంబంధించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. లఘు నాటికలు, వర్కింగ్ మోడల్స్, బోధనోపకరణాల ద్వారా అంతరిక్ష పరిశోధన సంస్థ సాధించిన విజయాలను అద్భుతంగా వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఏడాది కిందట చేపట్టిన చంద్రయాన్ ద్వారా ప్రపంచ గుర్తింపు లభించిందని చెప్పారు. అంతరిక్షంలో ప్లానటరీ నమూనాలను ప్రదర్శించారు. ఇందులో భాగంగా రాకెట్ మోడల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చంద్రయాన్‌లో అత్యంత కీలకమైన ల్యాండర్ నుంచి రోవర్ బయటకు రావడం అనే కీలక అంశాన్ని మెడల్స్ ద్వారా ప్రదర్శించి ఆకట్టుకున్నారు. రాకెట్ పని తీరును వివరించారు. ఇస్రో ప్రధాన ఘట్టాలను ఉపాధ్యాయులు వరలక్ష్మి, సుకేషిని, సుబ్బలక్ష్మి కళ్లకు కట్టారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మి, మధుసూదనరావు, సులోచన, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

గాజువాక: జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని స్థానిక ఎస్‌ఆర్ డీజీ స్కూల్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, చిత్రలేఖనం పోటీలతోపాటు అంతరిక్ష ప్రయోగ నమూనాలను తయారు చేసి ప్రదర్శించారు. చంద్రయాన్–1 నుంచి చంద్రయాన్–3 వరకు శాస్త్రవేత్తల కృషిని, అంతరిక్ష విజయాలను విద్యార్థులు ఈ సందర్భంగా వివరించారు. కేంద్ర విద్యాశాఖ, ఇస్రో అంతరిక్ష పరిశోధనా సంస్థ ద్వారా ఆన్‌లైన్‌లో నిర్వహించిన వివిధ పోటీల్లో విద్యార్థులు సాధించిన ప్రశంసా పత్రాలను విద్యార్థులకు అందజేశారు. పాఠశాల డీజీఎం మోహన్‌రెడ్డి , ప్రిన్సిపాల్ అశ్విని తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీని కలవనున్న ఉక్కు నేతలు

ఉక్కునగరం: లోకసభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీను కలవడానికి ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు అపాయింట్‌మెంట్ కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఉపసంహరణ అంశంపై బీజేపీ ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో పోరాట కమిటీ నాయకులు రాహుల్ గాంధీని కలవాలని నిర్ణయించారు. బీజేపీ ప్రభుత్వం, ఉక్కు యాజమాన్యాల నిర్ణయాల వల్ల కార్మిక వర్గంలో అశాంతి నెలకొందని లేఖలో పేర్కొన్నారు. పూర్తి సమాచారం తెలియజేయడానికి తగిన సమయం కేటాయించాలని కోరారు. ఈ మేరకు కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి జెర్రిపోతుల ముత్యాలు రాహుల్ గాంధీకి లేఖ రాశారు.

జోరుగా పందుల ఏరివేత



పందులను కాల్చి వేస్తున్న హంటర్

పెదగంట్యాడ: మండలంలోని విచ్చల విడిగా సంచరిస్తున్న పందులను జీవీఎంసీ అధికారులు ఏరివేశారు. హంటర్‌తో వాటిని షూట్ చేయించారు. మండలంలో పందుల బెడద తీవ్రంగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడేశారు. ఈ నేపథ్యంలో 'బాబోయ్ పందులు' శీర్షికన సాక్షిలో ఈ నెల 23న కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో జీవీఎంసీ ప్రజారోగ్య అధికారులు స్పందించారు. ప్రత్యేక డ్రైవ్ ద్వారా మండలంలో సంచరిస్తున్న పందులను ఏరి వేశారు. దీంతో స్థానికులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.

స్టీల్‌ప్లాంట్ వర్క్స్ ఇన్‌చార్జిగా శ్రీధర్



బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీధర్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ వర్క్స్ సీజీఎం ఇన్‌చార్జిగా ఉప్పలూరి శ్రీధర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంత వరకు సీజీఎం (వర్క్స్)గా విధులు నిర్వహించిన ఎ.కె. సోబ్తీను బదిలీ చేసి ఆ స్థానంలో శ్రీధర్‌ను నియమిస్తూ ఉక్కు యాజమాన్యం గురువారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసింది. భోపాల్ రీజనల్ ఇంజినీరింగ్ కాలేజీలో మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తి చేసిన శ్రీధర్ 1987 లో మేనేజ్‌మెంట్ ట్రైనీగా చేరారు. స్టీల్‌ప్లాంట్‌లో చేరిన శ్రీధర్ తన విధి నిర్వహణలో అనేక కీలక విభాగాల్లో బాధ్యతలు నిర్వహించారు. ట్రాఫిక్ విభాగంలో చేరిన అంచెలంచెలుగా అదే ట్రాఫిక్ విభాగానికి అధిపతి అయ్యారు. ప్లాంట్ అభివృద్ధికి విశేషంగా కృషి చేశారు. ప్రస్తుతం ఆయన వర్క్స్ ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించడంతో ఉక్కు ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దోపిడీ ముఠా సభ్యుల అరెస్ట్

మద్రిపాలెం: ఈ నెల 21వ తేదీ రాత్రి కాన్వెంట్ జంక్షన్ వద్ద దారి దోపిడీకి పాల్పడిన ఇద్దరిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు కంచరపాలెం క్రైం సీఐ నిమ్మకాయల శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. ఘటనకు సంబంధించిన వివరాలు.. మురళీనగర్ ప్రాంతానికి చెందిన బోర్ల మధు (22) జ్ఞానాపురం వద్ద అంతిమయాత్ర వాహన డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. బుధవారం రాత్రి 8 గంటలకు విధులు ముగించుకుని ఇంటికి వెళ్లేందుకు కాన్వెంట్ జంక్షన్ వద్ద వేచి ఉన్నాడు. ఈ క్రమంలో అటుగా హోండా యాక్టివాపై వచ్చిన ముగ్గురు వ్యక్తులు అతన్ని అటకాయించి రూ.200 నగదు, మొబైల్ ఫోన్ లాక్కొని ఉడాయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పోలీసులు బృందంగా ఏర్పడి మధురవాడ ప్రాంతానికి చెందిన గరుగుబిల్లి చైతన్య, శ్రీకాకుళం జిల్లాకు చెందిన గంగు భాస్కరరావులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. మరో నిందితుడు గోపి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

సత్తెమ్మతల్లి మహోత్సవాలు ప్రారంభం



సత్తెమ్మతల్లి



కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

గాజువాక: కొత్త గాజువాకలోని రాజీవ్‌మార్గ్‌లో సత్తెమ్మతల్లి మహోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. అమ్మవారికి ఆలయ కమిటీ ప్రతినిధులు తొలిరోజు కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఆదివారం ప్రధాన పండగ జరుగుతుందని ఉత్సవ కమిటీ చైర్మన్ సూరిశెట్టి శివ తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ పర్యవేక్షకులు దొడ్డి రమణ, మద్దాల అప్పారావు, దొడ్ల జగదీష్, ఆలయ కమిటీ సభ్యులు భీశెట్టి సింహాచలం నాయుడు, శరగడం కోటి, శరగడం సత్యనారాయణ, మళ్ల సత్తిబాబు, పెతకంశెట్టి జోగ అప్పారావు, కాంద్రేగుల హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో విద్యార్థుల సత్తా



విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ సురేంద్రబాబు

పెదగంట్యాడ: జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ శాఖ ఆధ్వర్యంలో 8, 9 తరగతి విద్యార్థులకు ఇటీవల నిర్వహించిన క్విజ్ పోటీల్లో మండలంలోని రెండు పాఠశాలలకు చెందిన విద్యార్థులు సత్తా చాటారు. నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోగా, ఇస్లాంపేట ఉన్నత పాఠశాల విద్యార్థి తృతీయ స్థానంలో నిలిచాడు. వీరికి అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ సీహెచ్ సురేంద్ర బాబు ప్రశంసా పత్రాలు అందజేశారు. జిల్లా సైన్స్ అధికారి కప్పల ప్రసాద్, గైడ్ టీచర్ డీఎస్ మూర్తి పాల్గొన్నారు.

త్రిశక్తి ఆలయంలో ప్రత్యేక పూజలు



కుంకుమ పూజల్లో పాల్గొన్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో శ్రీమహాలక్ష్మి, మహాదుర్గ, మహాసరస్వతి

ఉక్కునగరం: స్థానిక త్రిశక్తి దేవాలయంలో శ్రావణ మాస పూజలు వైభవంగా జరిగాయి. శ్రావణ మాసం మూడో శుక్రవారం పురస్కరించుకుని మహాలక్ష్మి, మహాదుర్గ, మహాసరస్వతి అమ్మవార్లకు సామూహిక కుంకుమార్చన జరిగింది. ఆలయ ప్రధానార్చకులు ఫణిశర్మ నేతృత్వంలో యంత్రం 4 గంటలకు ఆలయ ఆవరణలో చండీ హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు.